పంటలను సందర్శించిన జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు

విశాలాంధ్ర-రాపూరు:రాపూరు మండలం లోని సిద్ద వరం,రామిరెడ్డి పల్లి గ్రామాలలోరాపూరు మండల వ్యవసాధికారి . పి. సోము సుందర్ ఆధ్వర్యంలో జిల్లా వనరుల కేంద్రం ఏ.డి.ఏ శ్రీలక్ష్మి మాధవి మరియు కె.వి.కె శాస్త్రవేత్త డా. డి. విజయ్ కుమార్ నాయక్ వివిధ పంటలను సందర్శించడం జరిగింది.లక్ష్మి మాధవి మాట్లాడుతూ మినుములు కోతకు వచ్చినవి ఆలస్యం చేయకుండా కోతలు చెయ్యా లని సూచించారు. అదేవిధంగా శాస్త్రవేత్త డా. విజయ్ కుమార్ నాయక్ మాట్లాడుతూ ఈ ప్రాంతాలలో వరి బిర్రు పొట్ట దశలో ఉన్నదని రైతులు తప్పని సరిగా 200మి.లీ. ప్రొపికొనజోల్ ఒక ఎకరాకు పొట్ట దశలో ఒకసారి మరియు 50% వెన్ను వచ్చాక మరొ కసారి పిచికారి చేయడ వలన మానిపాడు తెగులు రాకుండా అడ్డుకోవచ్చు అని తెలిపారు. అదేవిధంగా గండూరుపల్లి గ్రామంలో నిమ్మ తో టలో తెల్లపొలుసు పొరుగు గమనించండం జరిగిందని దీని నివారణకు లీటరు నీటికి 0.5 మి.లీ. ఇమిడాక్లొప్రిడ్ మందు ద్రావణాన్ని కొమ్మలు కాండం తడిచెట్టటు పిచికారి చేయాని సూచించారు. నిమ్మలో పుట్టగొడుగుల నివారణకు పుట్టగొడుగులను ఏరి కాల్చేసిన తరువాత కాండం మీద బోర్డోపేస్ట్ పూయలని మరియు వేరు తడిచెట్టటు 1% బోర్డొ మిశ్రమం లేదా 0.3% కాపర్ ఆక్సి క్లోరైడ్ మందు ద్రావణాన్ని వేర్లు తడిచేటట్టు పాదులలో పోయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ వ్యవసాయ సహాయకులు మరియు రైతులు పాల్గొనడం జరిగిందన్నారు.

విశాలాంధ్ర

శ్రీ పొట్టిశ్రీరాములు

నెల్లూరు జిల్లా

బుధవారం 5 ఫిబ్రవరి, 2025. 4 పేజీలు

రాష్ట్రంలో రైల్వేల అభివృద్ధికి కేంద్రం పెద్దపీట: ఎంపీ

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు : రాష్ట్రంలో రైల్వేల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం భారీ స్థాయిలో నిధులు కేటాయించడంపై నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కేంద్ర రైల్వే శాఖ మంత్రి 9,417 కోట్లు కేటాయించి రాష్ట్రంలో రైల్వేల అభివృద్ధికి ఊతం ఇచ్చారని అభిప్రాయపడ్డారు. ఈ కేటాయింపు గత యుపిఎ ప్రభుత్వ కేటాయింపుల కన్నా 11 రెట్లు ఎక్కువ అని ఆయన అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో రూ. 84,559 కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టులు నడుస్తున్నాయని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దార్శనిక నాయకత్వానికి ఇది నిదర్శనమన్నారు. సీఎం చంద్రబాబు సారధ్యంలో, కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలో మరిన్ని ప్రాజెక్టులు రానున్నాయన్నారు. నెల్లూరు రైల్వే స్టేషన్ అభివృద్ధికి 103 కోట్లు ఖర్చు చేస్తుండడంపై జిల్లా ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రస్తుతం ఏపీలోని 16 జిల్లాల మీదుగా 8 వందే భారత్ రైళ్లు నడుస్తున్నాయన్న కేంద్ర మంత్రి అశ్వనీ వైష్ణవ్.. త్వరలో మరిన్ని వందే భారత్ రైళ్లను కేటాయిస్తామని చెప్పడం సంతోషకరమన్నారు. అలాగే 110, 130, 160 కిలోమీటర్ల వేగంతో రైళ్లు నడవడానికి వీలయ్యే వివిధ రైల్వే ట్రాక్ లను ఏపీలో అభివృద్ధి చేయనుండటం ద్వారా ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయన్నారు.

పదవీ విరమణ చేసిన అధికారులకు ఎస్పీ వీడ్కోలు

విశాలాంధ్ర బ్యూరో-నెల్లూరు: బాధ్యత యుతంగా విధులు నిర్వహించి, పదవి విరమణ పొందడం అభినందనీయం. అంకిత భావంతో జిల్లా పోలీస్ శాఖకు అందించిన సేవలను ఎప్పటికీ గుర్తుంచుకుంటుంది. పదవీవిరమణ పొందాక ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించి, వ్యాయమ క్రియలు, పుస్తక పఠనం వంటి ఆసక్తి గల అలవాట్లను అలవరుచుకోవాలని ఎస్పీ కృష్ణకాంత్ సూచనలు చేశారు. కుటుంబం,పిల్లల కోసం తల్లిదండ్రులు ఎంతో కష్టపడి, ఎన్నో త్యాగాలు చేసి ఉంటారు. వారి యోగక్షేమాలు చూసుకోవడం పిల్లల బాధ్యత. ఎవరికి ఎటువంటి అవసరమైన సంప్రదించాలని ఏ సమయంలో అయినా అందుబాటులో ఉండి తోడ్పాటును అందిస్తామన్నారు. ఈరోజు పదవి విరమణ అవుతున్నకావలి 1టౌన్ ఎస్ఐ అంబేద్కర్, పీసీర్ ఏఎస్ ఐ కృష్ణయ్య, బిట్రగుంట నిర్వహిస్తున్న ఏఎస్ఐ సుధాకర్ రెడ్డి, దగదర్తి ఏఎస్ఐ మోహన్ రావు, గూడూరు 1టౌన్ హోమ్ గార్డ్ శ్రీనివాసులులను ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్ నందు వారి కుటుంబ సభ్యులు, పోలీసు అధికారులు, సిబ్బంది సమక్షంలో జ్ఞాపికతో పూలమాలలతో సత్కరించి, వారి సేవలను కొనియాడారు. పోలీసు డిపార్ట్మెంట్‌లో ప్రజా సేవకే మీ సమయం వినియోగించినందుకు డిపార్ట్మెంట్ తరపున ఎస్పీ సౌజన్య ధన్యవాదాలు తెలిపారు. పదవి విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో ఆహ్లాదకరంగా గడపాలని టౌన్ డిఎస్పి సింధుప్రియ అన్నారు. పోలీస్ సిబ్బంది సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్న ఎస్పీకి ధన్యవాదములు అని పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు ప్రసాద్ అన్నారు. పదవీ విరమణ రోజే అన్ని బెనిఫిట్స్ అందించి, మమ్మల్ని ఘనంగా ఆత్మీయ వీడ్కోలు పలకడం, సత్కరించడం తమ జీవితంలో ఎన్నటికీ మరువలేమని ఎస్పీకి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యస్‌బి డిఎస్పి శ్రీనివాసరావు, ఎస్బి-1 సీఐ వెంకటేశ్వరరావు, ఎస్బి-2 సీఐ శ్రీనివాసరెడ్డి, ఆర్ఐ వెల్ఫేర్ రాజారావు,హోమ్ గార్డ్ ఆర్ఐ పోల్ రాజు, ఆర్ఐ అడ్మిన్ హరిబాబు, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు మద్దిపాటి ప్రసాద్, అసోసియేషన్ సభ్యులు,ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పదవి విరమణ పొందుతున్న అధికారుల, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్ర పండుగగా రథసప్తమి: మంత్రి ఆనం

రాష్ట్రవ్యాప్తంగా పురాతన ఆలయాలకు 38కోట్లతో పూర్వవైభవం

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు : సమస్త మానవళికి వెలుగులు ప్రసాదించే సూర్యభగవానుడికి అత్యంత ప్రీతికరమైన రథసప్తమిని రాష్ట్ర పండుగగా ప్రకటించినట్లు రాష్ట్ర దేవాదాయ, ధర్మదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. మంగళవారం రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని నెల్లూరు నగరంలోని మూలాపేట శ్రీ మూలస్థానేశ్వరస్వామి ఆలయాన్ని మంత్రి సందర్శించి మహాశివుడిని, అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయంలోని సూర్యభగవానుడిని దర్శించుకుని ప్రత్యేక అభిషేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలతో రథసప్తమి వేడుకలను రాష్ట్ర పండుగగా ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు చెప్పారు. అరసవెల్లిలోని ప్రముఖ సూర్య భగవానుడి ఆలయం నుంచి రాష్ట్రవ్యాప్తంగా రథసప్తమి వేడుకలకు శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున అరసవెల్లిలో ముఖ్యమంత్రి పట్టువస్త్రాలు సమర్పించాల్సి వుండగా, ఆ ప్రాంతంలో ఎన్నికలకోడ్ అమలులో వున్నందున దేవాదాయశాఖ ప్రత్యేక కార్యదర్శి ప్రభుత్వ లాంఛనాలతో పట్టువస్త్రాలు సమర్పించినట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఆలయాల్లో ఘనంగా రథసప్తమి పూజా కార్యక్రమాలను దేవాదాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు చెప్పారు. గత ప్రభుత్వం ఆలయాలను పూర్తిగా విస్మరించిందని, తమ ప్రభుత్వం ఆలయాల పవిత్రత, సనాతన ధర్మం పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ రాష్ట్రవ్యాప్తంగా పురాతన ఆలయాలను ఆగమశాస్త్రం ప్రకారం పున:నిర్మించి పూర్వవైభవానికి చర్యలు చేపట్టినట్లు చెప్పారు. నెల్లూరుజిల్లాలో 18 ప్రసిద్ధ ఆలయాల పున:నిర్మాణానికి రూ.38 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా మహాశివరాత్రి పర్వదినాన్ని అన్ని ప్రముఖ శైవక్షేత్రాల్లో అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు విస్తృతమైన ఏర్పాట్లు చేపట్టేలా అధికారులకు ఆదేశాలిచ్చినట్లు చెప్పారు. నెల్లూరు సిటీ ఎమ్మెల్యే, రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి నారాయణతో కలిసి శివాలయాన్ని సంద ర్శించి ఆలయ అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. ఆ ఆదిత్యుని దివ్యతేజోవంతమైన వెలుగులతో ప్రతిఒక్కరి జీవితం ఆనంద మయం కావాలని, రాష్ట్ర ముఖ్యమంత్రికి, రాష్ట్ర ప్రభుత్వానికి, రాష్ట్ర ప్రజలందరిపై సూర్యభగవానుడి ఆశీస్సులు మెండుగా ఉండాలని మంత్రి ఆకాంక్షించారు. తొలుత శివాల యానికి విచ్చేసిన మంత్రి ఆనంకు ఆలయ అర్చకులు, అధికారులు పూర్ణకుంభంతో అపూర్వ స్వాగతం పలికారు. అనంతరం వేద ఆశీర్వచన మండపంలో మంత్రిని ఘనంగా సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్లు కోవూరు జనార్ధన్‌రెడ్డి, శ్రీనివాసరావు, ఈవో అర్వభూమి శ్రీనివాసులు పాల్గొన్నారు.

పన్నుల బకాయిల వసూళ్లను వేగవంతం చేయండి:కమిషనర్

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు:నగర పాలక సంస్థ పరిధిలోని తాగునీటి కుళాయి పన్నుల వసూళ్లకై నిర్దేశించిన లక్ష్యాలను వేగవంతంగా పూర్తి చేసి, 100% లక్ష్యాలను సాధించాలని కమిషనర్ సూర్య తేజ సచివాలయ కార్యదర్శులను ఆదేశించారు. నెల్లూరు నగర పాలక సంస్థఇంజనీరింగ్ శాఖ అధికారులు, హౌసింగ్ విభాగం అధికారులు, సచివాలయ అమెనిటీస్ కార్యదర్శులతో కమాండ్ కంట్రోల్ విభాగంలో మంగళవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నీటి పన్నుల వసూళ్లకు ప్రతిరోజు ఉదయం నుంచి క్షేత్రస్థాయిలో పర్యటించాలని సూచించారు. పన్ను బకాయిలు ఉన్న ప్రతి ఒక్క ఆస్తి యజమానికి నోటీసులు జారీ చేసి నిర్దేశించిన సమయంలోపు చెల్లించని పక్షంలో తాగునీటి కుళాయి కనెక్షన్ తొలగిస్తామని తెలియజేయాలన్నారు. అందుబాటులో లేని భవన యజమానులను ఫోన్ ద్వారా సంప్రదించి ఆన్లైన్ పేమెంట్ చేయించేలా తగిన చర్యలు తీసుకోవాలని కమిషనర్ సూచించారు. 30 మంది సిబ్బందిని ప్రత్యేకంగా వీధి దీపాలు అమర్చేందుకు నియమించుకుని వారంలోపు నగర వ్యాప్తంగా పూర్తయ్యేలా పర్యవేక్షించాలని విద్యుత్ శాఖ ఎస్.ఈ. విజయన్‌కు కమిషనర్ సూచించారు. సెంట్రల్ లైటింగ్ విధానాన్ని నగరంలో 5 కూడళ్ళలో ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. సోలార్ విద్యుత్ వినియోగంపై ప్రజలందరూ అవగాహన పెంచుకొని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సూర్య ఘర్ బిజిలి యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ సూర్య తేజ తెలియజేశారు. కేంద్ర, రాష్ట్ర పభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ పథకాన్ని అమలు చేస్తోందని, సామాన్య ప్రజలకు కరెంటు బిల్లు తగ్గించుకోడానికి సోలార్ సూర్యఘర్ పథకం ఎంతో ఉపయోగప డుతుందని తెలిపారు. నెల్లూరు నగరంలో 7 వేల ఎస్సీ, ఎస్టీ కుటుంబాలను గుర్తించి 140 కోట్ల రూపాయలతో ప్రభుత్వం వారి ఇళ్లకు ఉచితంగా సోలార్ విద్యుత్ ఫలకలను బిగించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోందని కమిషనర్ వివరించారు. టిడ్కో గృహాలకు లబ్దిదారులను తరలించేలా చర్యలు చేపట్టండినగర వ్యాప్తంగా ఉన్న టిడ్కో గృహాలలో ఇప్పటి వరకు 17,520 గృహాలు నిర్మాణాలు పూర్తయి లబ్దిదారులకు అందు బాటులో ఉన్నాయని, అందులో 7636 గృహాలను ప్రజలు స్వాదీనం చేసుకుని నివాసం ఉంటున్నారని కమిషనర్ ఈ సమావేశంలో విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్, టిడ్కో ఎస్.ఈ మహేష్,నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం ఎస్.ఈరామ్ మోహన్ రావు, నగరపాలక, టిడ్కోహౌసింగ్ ఇంజనీరింగ్ అధికారులు,వార్డు సచివాలయ అమెనిటీస్ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

కోర్టు ఆదేశాల మేరకే రోడ్డు మార్జిన్ కొలతలు

విశాలాంధ్ర-ముత్తుకూరు: బ్రహ్మదేవం పొట్టిపాడు రోడ్డు ఆక్రమణ తొలగించాలంటూ కోర్టు నుండి ఆదేశాలు రావడం వల్ల రోడ్డు భవనాల శాఖ, రెవెన్యూ శాఖ అధికారులు ఆక్రమణల తొలగింపుకు మార్కింగ్ వేయడం జరిగిందని, దీనికి తెలుగుదేశం పార్టీకి ఎలాంటి సంబంధం లేదని టిడిపి బ్రహ్మదేవం నాయకులు సతీష్ నాయుడు తెలిపారు. గతంలో బ్రహ్మదేవం పంచాయతీ చెందిన మారు బోయిన చెంచయ్య బ్రహ్మదేవం రోడ్డు ఇరువైపులా ఆక్రమణకు గురైనందున రాకపోకలకు ఇబ్బందిగా మారిందని కావున ఆక్రమం తొలగించాలంటూ కోర్టును ఆశ్రయించడం జరిగిందని సతీష్ నాయుడు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో కూడా రెండు పర్యాయాలు రోడ్డు మార్గం తొలగించేందుకు అధికారులు మార్కింగ్ వేయడం జరిగిందన్నారు. అయితే కొందరు రోడ్డు మార్జిన్ వెంబడి ఉన్న ఇళ్లను తెలుగుదేశం పార్టీ వారు తొలగిస్తున్నారని వైసీపీ పార్టీకి చెందిన కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని ఇది సరైన పద్ధతి కాదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సర్వేపల్లి శాసనసభ్యులుసోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి బ్రహ్మ దేవం పంచాయితీలో అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలను చేయడం జరిగిందన్నారు. ఇల్లు కూల్చడం సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డికి తెలియదని, ఆయన అట్టడుగు వర్గాలను గిరిజనుల సంక్షేమానికి గ్రామాల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. రోడ్డుకు ఇరువైపులా వేసిన ఆక్రమణల మార్కింగ్ పై అందరూ కలిసి వస్తే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిని కలిసి సమస్త పరిష్కారాన్ని కృషి చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నన్నం దీనయ్య, మండల టిడిపి మైనారిటీ నాయకులు అలిముత్తు, తదితరులు పాల్గొన్నారు.

శకునాలపల్లిలో పోలం పిలుస్తుంది కార్యక్రమం

విశాలాంధ్ర-ఉదయగిరి: మండల పరిధిలోని శకునాల పల్లి కృష్ణంపల్లి గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం మంగళవారం జరిగింది స్థానిక మండల వ్యవసాయ అధికారి ఆంజనేయులు నాయక్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ రైతు సేవ కేంద్రాలలో యూరియా అందుబాటులో ఉందని అన్నారు. రైతులందరూ ఎంఆర్పి ధరలకే యూరియా విక్రయించాలని సూచించారు పంట వేసిన ప్రతి రైతు తప్పనిసరిగా ఈ పంట నమోదు చేయించుకోవాలి అని కోరారు. క్రాసింగ్ మొక్కజొన్న సజ్జ వేసిన రైతులు తప్పనిసరిగా విత్తన కంపెనీల దగ్గర అగ్రిమెంటు రాయించుకోవాలి విత్తనాలు తీసుకోవాలని అని సలహా ఇచ్చారు. అనంతరం ఆయన వరి మరియు క్రాసింగ్ సజ్జ పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సలహాలు సూచనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రైతులు, సహాయ వ్యవసాయ సహాయకులు ఏఈఓ వినోద్ రైతులు పాల్గొన్నారు.

వేపినాపి పిహెచ్‌సిలో ఆశ డే సమావేశం

పాఠశాలలో విద్యార్థులకు లెప్రసీ వ్యాధిపై అవగాహన

విశాలాంధ్ర-రాపూరు : రాపూరు మండలంలోని వేపినాపి ప్రాథమిక ఆర్యోగ్య కేంద్రంలో మంగళ వారం ఆశ డే సందర్భంగా సమావేశం నిర్వహించడం జరిగింది. ముఖ్యంగా ఆశ కార్యాకర్తల పనితీరు పై రివ్యూ చెయడం మరియు ఆశ డే అజెండా గురించి చెప్పడం జరిగింది వేపినాపిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలో వెపినాపి ప్రాథమిక అరోగ్య కేంద్రం డిపిఎంఒ వైద్య సిబ్బందితో జనవరి 30 తేది నుండి ఈనెల 13వ తేది వరకు జరిగే లేప్రోసి అవేర్నెస్ కాంపెయిన్ మీద మంగళవారం విద్యార్థులకు లేప్రోసి మీద అవగాహన కల్పించడం జరిగిందని తెలియజేసారు.

చుట్టూ పాళెంలో నిర్మాణంలో కోదండ రాముని ఆలయం

విశాలాంధ్ర-రాపూరు: రాపూరు మండలంలోని చుట్టూ పాళెం గ్రామంలో దాతల దాతృత్వంతో నిర్మా ణం పూర్తికానున్న కోదండ రాముని ఆలయ నిర్మాణం.ఆలయం చుట్టూ ప్రహరి గోడ కు దాతృత్వంతో దాతలు సహాయ సహకారాలు అందించి ఆలయ నిర్మాణానికి సహకరించాలని చుట్టూపాళెం గ్రామస్తులు విరాళాలు అందించి కోదండ రామ స్వామి కృపా కటాక్ష పొందగలరని తెలియజేసారు.

భూసేకరణలో రైతులకు అన్యాయం:మాజీ ఎమ్మెల్యే

విశాలాంధ్ర -కావలి: కావలి మండలం జరుగుతున్న భూసేకరణ అన్యాయంగా ఉందని, రైతులను నష్ట పరిహారం విషయంలో అన్యాయం చేసేలా జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నిర్మించిన రామాయపట్నం పోర్టుకు అనుబంధంగా ఏర్పాటయ్యే పరిమశ్రమలు కోసం అవసరమైన భూములను సేకరించడానికి టీడీపీ నాయకులు, అధికారులు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. తన నివాసంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చెన్నాయపాలెం, ఆనెమడుగు, సారవ్యపాలెం, పెద్ద పట్టపుపాలెం గ్రామాల్లో భూములను ఎకరాకు కనీసం రూ.30 లక్షలు నుంచి రూ.50 లక్షలు ఇవ్వాలని అప్పట్లోనే నిర్ణయించామన్నారు. ఇప్పుడు అధికారంలో ఉన్న టీడీపీ నాయకులు గ్రామ సర్పంచ్‌లకు, ఎంపీటీసీలకు, ఎంపీపీలకు, జడ్పీటీసీలకు కూడా కనీసం సమాచారం ఇవ్వకుండానే భూసేకరణ కోసం గ్రామాల్లో గ్రామ సభలు పెట్టిస్తున్నారని అన్నారు. కేవలం రూ. 11 లక్షలు ఇస్తామని, ప్రభుత్వ భూమి అయితే అసలు ఏమీ ఇవ్వమని దబాయిస్తున్నారని తెలిపారు. ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన ప్రస్తుతం ఎమ్మెల్యే గ్రామాల్లో ప్రజలను, రైతులను మభ్యపెట్టి రూ.40 లక్షలు నుంచి రూ.50 లక్షలు ఇప్పిస్తామని చెప్పి ఓట్లు వేయించుకొని గెలిచిన విషయం ఇప్పుడు విస్మరించారన్నారు. భూములకు మంచి ధరలు వచ్చేలా చేయాల్సిన భాధ్యత అధికారంలో ఉన్న టీడీపీ నాయకులకు, ప్రతిపక్షంలో ఉన్న తమ పార్టీ నాయకులకు భాధ్యత ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ మాత్రం రైతులకు అండగా ఉంటుందని చెప్పారు. కావలి ప్రాంతం అభివృద్ధి చెందాలంటే పరిశ్రమలు రావాల్సిందే అన్నారు. అలాగే రైతులకు ఎకరా రూ.30 లక్షలకు తగ్గ కుండా నష్టపరిహారం అందేలా చేసి న్యాయం చేయాలని సీఎం, ఎమ్మెల్యేలను కోరుతున్నట్లు చెప్పారు. సంగం బ్యారాజ్ వద్ద కావలి కాలువకు బైపాస్ కెనాల్ నిర్మించడం, కావలి పెద్ద చెరువును బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా అభివృద్ధి చేయడం, కావలి ట్రంక్‌రోడ్డు విస్తరణ పనులను పూర్తి చేయడం తదితర వాటిపై సత్వరమే దృష్టి పెట్టాలని రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికలు కోడ్ అమల్లో ఉండటంతో విద్యార్థులకు ఫీజు రీఎంబర్స్‌మెంట్ పై జరపతలపెట్టినఫీజుపోరు కార్యక్రమంలో వాయిదావేసినట్లు చెప్పారు.

జిల్లా ఉత్తమ ఎంఈఓగా కాటంరెడ్డికి పురస్కారం

విశాలాంధ్ర -అనంతసాగరం : అనంతసాగరం మండలం ఎంఈఓ 2 విధులు నిర్వహిస్తున్న కాటంరెడ్డి ప్రభాకర్ రెడ్డి మంగళవారం నెల్లూరు టౌన్ హాల్లో జిల్లా ఉత్తమ ఎంఈఓ టూ గా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, రాష్ట్ర ప్రైవేట్ స్కూలు సంఘం అధ్యక్షులు తులసి ప్రసాద్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఉత్తమ ఎంఈఓ 2 కాటంరెడ్డి ప్రభాకర్ రెడ్డిని జిల్లా ప్రైవేట్ సంఘం అధ్యక్షులు, నియోజకవర్గంలోని కరస్పాండెంట్, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఉత్తమ పురస్కారం అందుకున్న కాటంరెడ్డి ప్రభాకర్ రెడ్డిని వైయస్సార్ టిపి రాష్ట్ర కార్యదర్శి మెటుకూరు సుబ్బారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు సత్యాల దానియల్, వైయస్సార్ టి ఏ మండల అధ్యక్షురాలు నీరు కట్టు శ్రీలత, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు పాపిశెట్టి నరసింహులు, ఉపాధ్యాయులు పోలంరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, సురేష్, మండలంలోని ఉపాధ్యాయులు అభినందించారు.

ఘనంగా వార్షికోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-కందుకూరు రూరల్: కందుకూరు పట్టణం లోని, ఓవి రోడ్‌లో ఉన్న బిఆర్ ఆక్స్ ఫర్డ్ విద్యాసంస్థల శ్రీ వివేక డిగ్రీ కాలేజీలి నందు మంగళవారం వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ,విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. అనంతరం ఆటల పోటీలలో మరియు పరీక్షలలో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన విద్యార్థులకి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి బిఆర్ ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల చైర్మన్ ఉన్నం భాస్కరరావు మాట్లాడుతూ డిగ్రీ అనంతరం కోర్సుల పై దృష్టి సారించి భవిష్యత్తులో తల్లిదండ్రుల కు మంచి పేరు తీసుకొని రావాలని విద్యార్థులకి సూచించారు.ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు, డైరెక్టర్స్ జి.బాల భాస్కరరావు, బి.నరేంద్రబాబు, చైర్మన్ ఉన్నం భాస్కరరావు తనయుడు మహేష్, కళాశాల ప్రిన్సిపాల్ అబ్బూరి వెంకటేశ్వర్లు,తదితర కళాశాల సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.

వేరుశనగ రైతులకు అవగాహన

విశాలాంధ్ర - ఉలవపాడు : పొలం పిలుస్తుంది కార్యక్రమం అలగాయపాలెం గ్రామంలో నిర్వహించడం జరిగినది అక్కడ వేరుశనగ పైరులో రైతులు సూక్ష్మ ధాతు లోపం రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి వివరించడం జరిగినది జింకు లోపం వచ్చినప్పుడు మొక్కలు గిరిస బారి పోతాయి 200 గ్రాముల జింక్ సల్ఫేట్ 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమానికి అలగాయపాలెం రైతులు పాల్గొన్నారు.

హెూమియోపతి మందులతో జబ్బులు మాయం

విశాలాంధ్ర -కావలి: అనారోగ్యం వచ్చినప్పుడు హోమియో పతి మందులు వాడడం వల్ల ఎలాంటి సైడ్ ఎఫెక్ట్ రాకుండా జబ్బులు నయమవుతాయని ప్రముఖ హోమియోపతి వైద్యులు కే. యం ప్రకాష్ రాజు పేర్కొన్నారు. పట్టణంలోని క్రిస్టియన్ పేట మొదటి లైన్‌లో రాజుస్ హోమియో కేర్ సెంటర్ నందు మంగళ వారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైనసైటిస్, సయాటికా, సంతానలేమి, అలర్జీ, మై గ్రీన్ , థైరాయిడ్ గర్భకోశ సమస్యలతో పాటు కిడ్నీలో రాళ్లను ఆపరేషన్ లేకుండా క్రమం తప్పకుండా హోమియోపతి మందులు వాడడం వల్ల మంచి ఫలితాలు వస్తాయ అన్నారు. ఎలాంటి వ్యాధులకైన ఆపరేషన్ లేకుండా మందులు వాడడం వల్ల ఆరోగ్యాన్ని పదిలంగా ఉంచుకోవచ్చని తెలిపారు.

ఎంపిటిసి ఇంటికి నిప్పు పెట్టిన గుర్తు తెలియని వ్యక్తులు

విశాలాంధ్ర-ఉదయగిరి: మండల పరిధిలోని తిరుమలాపురం పంచాయతీ గుడ ్నెరవ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపిటిసి అంటి భాస్కర్ రెడ్డి ఇంటికి గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం రాత్రి నిప్పు పెట్టారు కుటుంబీకుల వివరాల మేరకు సోమవారం రాత్రి 11 గంటల ప్రైబడి ఎంపిటిసి ఇంట్లో పెద్దగా మంటలు రావడంతో స్థానికులు కేకలు వేయడంతో పక్కనే ఉన్న బంధువులు కుటుంబ సభ్యులతో ఎగసిపడుతున్న మంటలను అక్కడే ఉన్న నీటితో అదుపు చేశామన్నారు. మంగళవారం ఉదయం స్థానిక ఎస్ఐ ఇంద్రసేనారెడ్డికి ఫిర్యాదు చేశామని ఇప్పటి దాక గ్రామంలో ఇలాంటి దారుణం జరగలేదన్నారు గతంలో ఫ్లెక్సీలు చించడం తో చిన్నపాటి గొడవను స్థానికులు చర్చించి సర్దుబాటు జరుగుతాయని ఇలాంటి దారుణానికి వడిగట్టిన వారిని గుర్తించి శిక్షించాలని మరోసారి ఇలాంటివి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదుదారుడు కోరినట్లు తెలిపారు. అనంతరం ఉదయగిరి బిట్ -1ఎంపిటిసి గొల్లపల్లి తిరుపతి సంఘన స్థలానికి చేరుకొని కుటుంబ సభ్యులను కలిసి జరిగిన విషయాలను అడిగి తెలుసుకున్నారు. వెంటనే స్పందించిన ఎస్ ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి తమ సిబ్బందితో సంఘటన ప్రాంతానికి చేరుకొని పరిశీలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

నివేశస్థల మంజూరుపై బాధితుని ఆవేదన

విశాలాంధ్ర-అనంతసాగరం : అనంతసాగరం మండల కేంద్రంలో ఒకరికి కేటాయించిన ఇంటి స్థలంలో మరొకరు అక్రమంగా ఇల్లు కట్టడాన్ని మంగళవారం బాధితుడు అడ్డుకొని స్థానిక తహసిల్దార్ ఆఫీసులో ఏఎస్ఓ మోహన్‌కు అర్జీ ఇచ్చి న్యాయం చేయాలని వేడుకున్నారు. స్థానిక తహసిల్దార్ మంజూరు చేసిన పట్టాలను పరిశీలించి తగిన న్యాయం చేయాలని ఈ సందర్భంగా కోరారు.

ఎస్సీ వర్గీకరణకై ఛలో హైదరాబాద్

విశాలాంధ్ర-రాపూరు: హైదారాబాద్‌లో ఈనెల 7వ తేదిన జరిగే లక్ష డప్పులు, వేలుగోంతులు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి కొండాపురం వేంకటేశ్వర్లు తెలియజేసారు. సామాజిక ఉద్యమ నేత మందా కృష్ణ మాదిగకు పద్మశ్రీ పురస్కారంలభించిన సందర్భంగా ఏపి ఎంఆర్పిఎస్ శుభాకాంక్షలు తెలియజేసారు. మండలంలో ఏపి ఎంఆర్పిఎస్ తరుపున కొన్ని గ్రామాలలో 50వరకు "డప్పులు" పంపిణీ చేసి ఉన్నాము, వారందరూ డప్పుతో తరలిరావాలన్నారు. అదేవిధంగా మండలంలో ఉన్న ప్రతి మాదిగపల్లె నుంచి ఇంటికొకరు రావాలని విజ్ఞప్తి చేస్తున్నామని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఏపి ఎంఆర్పిఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కదిరి వెం కటేశ్వర్లు మాదిగ, నాయకులు లక్కిపోగు రాజ కుమార్, కదిరి ఈశ్వరయ్య, ముత్తుకూరు సుబ్బయ్య మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

విప్‌ఉల్లంఘించిన కార్పొరేటర్లపై చర్య తీసుకోవాలి

-ఎమ్మెల్సీచంద్రశేఖర్ రెడ్డి

విశాలాంధ్ర-బ్యూరో నెల్లూరు : నెల్లూరు జిల్లా కలెక్టరేట్ లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నగర నియోజకవర్గ కార్పొరేటర్లు, నాయకులతో కలిసి నెల్లూరు కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఉప ఎన్నికల ప్రెస్టైడింగ్ అధికారి జాయింట్ కలెక్టర్ కార్తీక్‌ని కలిసి డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో విప్ ఉల్లంఘించి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి కాకుండా ఇండిపెండెంట్ అభ్యర్థికి ఓటు వేసిన వైఎస్ఆర్సిపి కార్పొరేటర్లపై అనర్హత వేటు వేయాలని కోరుతూ వైసిపి నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్చార్జ్ ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ప్రిసైడింగ్ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖలీల్ అహ్మద్, హంజా హుస్సేనీ, కార్పొరేటర్లు కరీముల్లా, వేలూరు ఉమా మహేష్, ఊటుకూరు నాగార్జున, నేతాజీ సుబ్బారెడ్డి, నీలి రాఘవరావు, బొబ్బల శ్రీనివాస్ యాదవ్, కామాక్షి దేవి, గుంజి జయలక్ష్మి , వైసిపి నాయకులు పేర్నేటి కోటేశ్వరరెడ్డి,రవూఫ్, మున్వర్, అలీం పాల్గొన్నారు.

నాగబాబుని కలిసిన జనసేన మహిళా అధ్యక్షురాలు

విశాలాంధ్ర-రాపూరు : రాపూరు మండల జనసేన పార్టీ మండల అధ్యక్షురాలు కొండాపురం కస్తూరి తిరుపతిలో జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగేంద్రబాబు జరిగిందని. కూటమి ప్రభుత్వం లో ప్రతి ఒక్కరు కలిసి కట్టుగా కష్టంపడి పనిచెయాలని, వైసిపి పార్టీ వాళ్ళు ఎక్కడైన అన్యాయలు, అక్రమాలు చెస్తుంటె ధైర్యంగా ఎదుర్కొనే శక్తి జనసేన మహిళలకు ఉందని ప్రతి ఒక్కరు కూడా మండల స్థాయిలో గ్రామస్థాయిలో ప్రజల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు ప్రజలు దృష్టికి తీసుకొని వెళ్ళండి ఎంత కష్టానైనా భరించగల ఒక శక్తి నారీమ ణులకే ఉంటుంది. అలాంటి వారే మీరు మహిళలు అందుకే మీకు పవన్ కళ్యాణ్ వీర మహిళ అని ఒక బిరుదు ఇచ్చారని, అభివృద్ధిని మీరు ఒమ్ము చేయకుండా పార్టీ కోసం కష్టపడి పని చేయండి చేసిన వారికి తగిన గుర్తింపు వస్తుంది అని పలుసూచనలు సలహాలు నాగబాబు చెప్పడం జరిగిందని రాపూరు మండల జనసేన పార్టీ అధ్యక్షురాలు కస్తూరి తెలియజెసారు.

వరి తెగుళ్లపై అవగాహన

విశాలాంధ్ర-మనుబోలు : రైతులు వ్యవసాయ సీజన్లో వచ్చే తెగుళ్లపై స్థానిక శ్రీ రవి ఫెర్టిలైజర్స్ వారి ఆధ్వర్యంలో నిచినో ఇండియా ప్రవేట్ లిమిటెడ్ వారి సౌజన్యంతో రైతులకు వరి పైరుకు వచ్చే తెగుళ్ళ భాద నుండి విముక్తి కలిగేలా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిచినో ఇండియా ప్రవేట్ లిమిటెడ్ జాతీయ మార్కెటింగ్ అధికారి ఉప్పు గిరీష్ మాట్లాడుతూ వరి పైరుకు దోమ, అగ్గి తెగుళ్ళతో తీవ్రమైన నష్టం వాటిల్లే ప్రమా దం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు నిచినో ఇండియా ప్రవేట్ లిమిటెడ్ రీజినల్ మార్కెటింగ్ మేనేజర్ లెనిన్ బాబులు మేనేజర్ శ్రీనివాసులురెడ్డి, రవి ఫెర్టిలైజర్స్ అధినేత దామిశెట్టి రంగారావు, రైతులు వున్నారు.

ఆస్తి పన్ను బకాయిల వసూళ్లు వేగవంతం: డిప్యూటీ కమిషనర్

విశాలాంధ్ర, నెల్లూరు టౌన్: నగర పాలక సంస్థ పరిధిలోని ఆస్తి పన్ను, ఖాళీ స్థలం పన్ను, షాపు రూముల బాడుగల వసూళ్లకై నిర్దేశించిన లక్ష్యాలను వేగవంతంగా పూర్తి చేసి, 100శాతం లక్ష్యాలను సాధించాలని డిప్యూటీ కమిషనర్ చెన్నుడు రెవెన్యూ విభాగం అధికారులు, సచివాలయ కార్యదర్శులను ఆదేశించారు. నెల్లూరు నగర పాలక సంస్థ రెవెన్యూ విభాగం అధికారులు, సచివాలయ అడ్మిన్ కార్యదర్శులతో కమాండ్ కంట్రోల్ విభాగంలో మంగళవారం వారాంతపు సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ పన్నుల వసూళ్లకు ప్రతిరోజు ఉదయం నుంచి క్షేత్రస్థాయిలో వసూళ్ల కొరకు పర్యటించాలని సూచించారు. గత వారములో నిర్దేశించిన విధముగా కోటి రూపాయల పన్ను వసూళ్ల లక్ష్యాన్ని నిర్దేశించు కోవాల న్నారు. పన్ను బకాయిలు ఉన్న ప్రతి ఒక్క ఆస్తి యజమానికి నోటీసులు జారీ చేసి నిర్దేశించిన సమయంలోపు చెల్లించని పక్షంలో తాగునీటి కుళాయి కనెక్షన్ తొలగిస్తామని హెచ్చరికలు తెలియజేయాలన్నారు. అందుబాటులో లేని భవన యజమానులను ఫోన్ ద్వారా సంప్రదించి ఆన్లైన్ పేమెంట్ చేయించేలా తగిన చర్యలు తీసుకోవాలని కమిషనర్ సూచించారు. ఈ ఆర్థిక సంవత్సరం మార్చి నెల 31వ తేదీ నాటికి నిర్దేశించిన లక్ష్యాలను అందుకోని కార్యదర్శులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు, అలాగే కొత్తగా నిర్మించిన భవనములు, అదనంగా నిర్మించిన అంతస్తులు ,మార్పులను, ఖాళీ స్థలము లను గుర్తించి పన్ను పరిధిలోకి తీసుకొని రావాలసిందిగా ఆదేశించారు. ఈ సమావేశంలో నగర పాలక సంస్థ రెవెన్యూ అధికారి ఇనాయతుల్లా, సూపరింటెండెంట్ శ్రీనివాసులు, ఇన్స్పెక్టర్లు, వార్డు సచివాలయ అడ్మిన్ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు

గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం

విశాలాంధ్ర-గుడ్లూరు: మండలంలోని చేవూరు మరియు రావూరు రైతు సేవా కేంద్రాల పరిధిలోని గ్రామాలలో మండల వ్యవసాయ అధికారి బి.రవికుమార్ అధ్యక్షతన పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగినది. వ్యవసాయ శాఖ మరియు అనుబంధ రంగాలు పొలం పిలుస్తోంది వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు వ్యవసాయ విస్తరణ కార్యక్రమం .ఈకార్యక్రమంలో వరి మద్దతు ధర గురించి మాట్లాడుతూ ధాన్యం మద్దతు ధర సాదారణ రకానికి క్వింటా ఒక్కయింటికి రూ. 2300. గ్రేడు-ఎ రకానికి రూ. 2320. ప్రస్తుతం మండలానికి ఒక కొనుగోలు కేంద్రానికి అనుమతి ఇవ్వడం జరిగినది. కొనుగోలు కేంద్రం ద్వారా ధాన్యం అమ్ముకోదలచినవారు తప్పనిసరిగా పంటను ఈ -పంట లో నమోదు చేయించుకొని ఈ- కేవైసీ చేయించుకొని ఉండాలి. కావున రైతులు ఇంకనూ %వ%-పంట చేయించుకోని వారు మీ పరిధిలోని రైతు సేవా కేంద్రం నందలి గ్రామ వ్యవసాయ లేదా ఉద్యాన సహయకులను సంప్రదించి ఈ -పంట చేయించుకో వాలసినదిగా మనవి. ఈ -పంటలో నమోదుకానివారికి కొనుగోలు కేంద్రం ద్వారా అమ్ముకోవడంకుదరదు. మద్దతుధర అనేది ప్రభుత్వనిభంధనలకు అనుసరించి ఉంటుంది. మట్టిపెళ్ళలు, రాళ్ళు, వ్యర్థ పదార్ధాలు, తాలు, రంగుమారిన గింజలు, చెత్త, తేమశాతం అనుసరించి ధర ఉంటుందిఅని వివరించారు. ఈ కార్యక్రమములో నాయకులు, గ్రామ వ్యవసాయ సహాయకులు పి.రఘు, పి.శైలజ మరియు రైతులు పాల్గొన్నారు.

ఇల్లు దగ్ధం - నగదు, బంగారం బూడిదపాలు

విశాలాంధ్ర-రాపూరు : రాపూరులోని కొత్త హరిజనవాడలో నివాసముంటున్న వేగూరు భాస్కర్. ఇల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయినది. సోమవారం రాత్రి 8 గంటల కు ఇంట్లో ఎవరు లెనందున ప్రాణనష్టం జరగలేదు. పెళ్ళి విషయం, ఇంటి విషయమై తీసుకోచ్చిన, 5లక్షలు 2 వేలు నగదు,4 సవర్ల బంగారం, పోలం సంభందించిన పత్రాలు, పాస్ పోర్టు, గుడ్డలు, బుడిద పాలైనయని కట్టు బట్టలె మిగిలాయని, మెములెని సమయంలో జరిగిందని బాధితుడు వెదోటి భాస్కర్ తెలిపాడు. సోమవారం రోజు నాభార్య పిల్లల తో తిరుపతి పోయిందని నెను పనికి పోయిరాత్రి ఇంటికొచ్చినప్పుడు మంటలు వస్తుండటంతో చుట్టు ప్రక్కల వారు ఫైర్ స్టేషన్‌కు తెఇపారు. బాధితులను ఎంఆర్పిఎస్ నాయకులు పరామర్శించారు.

గిరిజనుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర-ముత్తుకూరు: రాష్ట్రంలోని అట్టడుగున జీవనం సాగిస్తున్న గిరిజనుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం లక్ష్యం చేసుకుని పని చేస్తుందని జనసేన సర్వేపల్లి నియోజకవర్గం సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్ నాయుడు తెలిపారు. మంగళవారం తోటపల్లి గూడూరు మండలంలోని నేలిమిట్ట కండ్రిగ గిరిజన కాలనీలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడ గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను, వారి జీవన విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు టిట్కో చైర్మన్ వేములపాటి అజయ్ సూచనలతో కూటమి ప్రభుత్వం అట్టడుగున ఉన్న గిరిజనుల సమస్యలను పరిష్కరించడం వాళ్లకి ఆధార్ కార్డులు రేషన్ కార్డులు, ఓటర్ కార్డులు ఉండటానికి ఇల్లు పెన్షన్ లాంటి సదుపాయాలను సమకూర్చే విధంగా కూటమి ప్రజా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. అందులో భాగంగా పంచాయతీరాజ్ శాఖ మంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ శాఖలో భాగమైన సర్వేపల్లి నియోజకవర్గం లోని 117 పంచాయతీలలో ఏ గ్రామ పంచాయతీ పరిధిలో గిరిజనులు ఉన్నారో వారి వద్దకు వెళ్లిగాంధీ గిరిజన కాలనీ నందు పర్యటించి గిరిజనులతో మాట్లాడి వాళ్ళ స్థితిగతులు అడిగి తెలుసుకుని వాళ్లకు సంబంధించినటువంటి అనేక సమస్యలను సచివాలయం ద్వారా పరిష్కరించే విధంగా అడుగులు ముందుకు వేయడం జరుగుతోం దన్నారు.ఇది మంచి ప్రభుత్వం ఇది ప్రజా ప్రభుత్వం ఇదే రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడిపించే ప్రభుత్వం.ఈ కార్యక్రమంలో ముత్తుకూరు మండల సీనియర్ నాయకులు రహీం, సందాని శ్రీహరి, బొల అశోక్, కావలి మస్తాన్, సుమన్ ,రెహామాన్, చిన్న, తదితరులు పాల్గొన్నారు.

కాగితాలపూరులో పొలం పిలుస్తుంది

విశాలాంధ్ర :-మనుబోలు: మండల పరిధిలోని కాగితాల పూరులో పొలం పిలు స్తుంది కార్యక్రమం ఏడిఏ శివ నాయక్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ గ్రామ సభ పెట్టి ప్రస్తుతం పండిస్తున్న వరి యొక్క పంటల యాజమాన్య పద్ధతులు గురించి వివరించారు. రైతులు చివరన 25 కేజీ పటాస్ 50 కేజీలతో కలిపి వేసుకుంటే పిలకలు ఎక్కువగా వచ్చి వరి కంకి పాలు పోసుకునేటప్పుడు మంచి ఉపయోకారంగా ఉంటుందని తెలిపారు త్వరలో పొట్ట కుళ్ళు లేదా ఎర్ర తెగులు కి నివారణ కు ప్రొసికోనా జోల్ అను మందును ఎకరాకు ఒక లీటరు పిచికారి చేసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎస్‌కే జహీర్ ,వీఏఏ తేజస్వి మరియు గ్రామ రైతులు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి అంత్యోదయ యోజన కేటాయింపులపై ఎంపి ఆరా

విశాలాంధ్ర- బ్యూరో నెల్లూరు : కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన దీనదయాళ్ అంత్యోదయ యోజన-జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ కింద ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఎంత నిధులు కేటాయించారని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మంగళవారం లోక్‌సభలో ప్రశ్నించారు. ఈ మేరకు పలు అంశాలపై ఆయన లోక్‌సభలో ప్రశ్నించారు. ఈ మిషన్ 2023-24 నాటికి పది కోట్ల మంది మహిళలకు చేరువ కావాలని ప్రభుత్వం నిర్ణయించింది వాస్తవమా అని ఆరాతీశారు. ఆంధ్రప్రదేశ్ ప్రత్యేకించి నెల్లూరు జిల్లాలో మిషన్ అమలు చేయబడిన బ్లాకుల వివరాలు, ఆంధ్రప్రదేశ్ కు ఈ పథకం ద్వారాకేంద్ర కేటాయింపులు ఎన్నని కోరారు.ఎంపీ వేమిరెడ్డి ప్రశ్నలకు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చింది. 2023-24 నాటికి దీనదయాళ్ అంత్యోదయ యోజన-నేషనల్ రూరల్ లైవ్లీహుడ్ మిషన్ కింద 10 కోట్ల గ్రామీణ కుటుంబాలను మార్చాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. మార్చి 2024లోనే ఈ లక్ష్యాన్ని సాధించామన్నారు. నెల్లూరు జిల్లాలో 37 రూరల్ బ్లాక్లు ఉన్నాయని, ఈ అన్ని బ్లాకుల్లో మిషన్ అమలవుతోందన్నారు. ఈ మిషన్ కింద ఆంధ్రప్రదేశ్ కు గత మూడు ఆర్థిక సంవత్సరాల్లో రూ.756 కోట్లు కేంద్ర కేటాయించిందని, అయితే ట్రెజరీ నుండి నిధులు రావడంలో జాప్యం, రాష్ట్రం ప్రతిపాదనలు సమర్పించకపోవడంలో ఆలస్యం వల్ల ఇప్పటివరకు కేవలం 377 కోట్లు మాత్రమే విడుదలయ్యాయని వివరించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికిఈ పథకం కింద కేంద్ర వాటా 307.69 కోట్లు కాగా, ఇప్పటివరకు రూ.76.92 కోట్లు విడుదలయ్యాయని చెప్పారు. మహిళాకిసాన్ సశక్తికరణ్ పరియోజన కింద ఆంధ్రప్రదేశ్‌లో 13 ప్రాజెక్టులకు మంత్రిత్వ శాఖ 2011లో ఆమోదం తెలిపిందని, ఈ ప్రాజెక్టులు 2019 ఆర్థిక సంవత్సరంలో మూసివేయబడ్డాయన్నారు. ఎం కే ఎస్ పి పథకం కింద 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ. 64 కోట్లు కేటాయించగా.. కేంద్ర వాటాగా రూ. 38.40 కోట్లు, రాష్ట్ర వాటాగా రూ. 25.60 కోట్లన్నారు. అంతేకాకుండా, వ్యయ శాఖ నిబంధనల ప్రకారం కేంద్ర ప్రాయోజిత పథకాల కింద నిధుల విడుదలకు తప్పనిసరి అయిన 2023-24 ఆర్థిక సంవత్సరానికి పబ్లిక్ ఫైనాన్షియల్ మేనేజ్ మెంట్ సిస్టమ్ నివేదికలో ఎంకేఎస్ పి బడ్జెట్ కేటాయింపుచేయలేదన్నారు. దీని కారణంగా 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఎం కే ఎస్ పి కోసం ఆంధ్రప్రదేశ్ మంత్రిత్వ శాఖ ఎటువంటి నిధులను విడుదల చేయలేదని వివరించారు.ఇక 2024-25 ఆర్థిక సంవత్సరానికి మొత్తం కేటాయింపులు 15 కోట్లు కాగా కేంద్రం రూ. 9 కోట్లు, రాష్ట్రం రూ.6 కోట్ల వాటాఅని, కేంద్ర వాటాలో భాగంగా రూ.2.25 కోట్లు విడుదల చేశామన్నారు. స్టార్ట్-అప్ విలేజ్ ఎంటర్ప్రెన్యూర్షిప్ ప్రోగ్రామ్ కి సంబంధించి, రాష్ట్రం నుంచి డీపీఆ ర్ ల సమర్పణ ఆధారంగా నిధులు విడుదల చేయబడతాయని, అయితే ఆంధ్రప్రదేశ్ సర్లమ్ స్పేప్ కాంపోనెంట్లకు అవసరమైన డీపీఆర్ లు సమర్పించడంలో జాప్యం చేయడం వల్ల నిధుల విడుదల చేయడంలో జాప్యం జరుగుతోందన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి 13.33 కోట్లు కాగా.. రూ. కేంద్ర వాటాగా 8 కోట్లల్లో 2 కోట్లు విడుదల చేశామన్నారు.

తిరుమల రథ సప్తమి వేడుకలలో ప్రశాంతిరెడ్డి

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వారికి రథ సప్తమి వేడుకలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. తెల్లవారుజామునుంచే ప్రారంభమైన వాహన సేవలు.. భక్తులను తరింపజేస్తున్నాయి. రథ సప్తమి వేడుకల సందర్భంగా కోవూరు ఎమ్మెల్యే, తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు మెంబర్ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తిరుమల శ్రీ వారి వాహన సేవలో పాల్గొన్నారు. తెల్లవారు జామున నిర్వహించిన సూర్యప్రభ వాహన సేవలో టిటిడి బోర్డు ఛైర్మన్ బి.ఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, ఇతర బోర్డు సభ్యులతో కలిసి ఆమె వాహన సేవలో పాల్గొని శ్రీవారి ఆశీసులు అందుకున్నారు. రథసప్తమి ఏర్పాట్లపై ఆయా అధికారులతో ప్రశాంతి రెడ్డి మాట్లాడారు.

ఏసీ స్టేడియంలో వరల్డ్ క్యాన్సర్ డే

విశాలాంధ్ర -నెల్లూరు సిటీ: నెల్లూరులోని ఏసి స్టేడియంలో వరల్డ్ క్యాన్సర్ డే నిర్వహించారు. వివేకానందం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అంకాలజిస్టులు రమేష్ బాబు, హరికాంత్ పాల్గొని మాట్లాడారు. స్మోకింగ్, ఆల్కహాల్, పొగాకు. కారణంగా కేన్సర్ వ్యాపిస్తుందని తెలిపారు. వయసు పెరిగే కొద్దీ ఆహారపు అలవాట్లు మార్చుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు. చింతల అమరేంద్రరెడ్డి కార్యదర్శి పొన్నం రవిచంద్ర, కోశాధికారి గోపీనాథ్. గౌరవ అధ్యక్షుడు మేకల నరేంద్రరెడ్డి. వాకర్స్ గవర్నరు డి.వి.సుబ్బరాజు రాఘవేంద్ర షెట్టి. తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి టాలెంట్ టెస్ట్‌లో
ప్రథమ స్థానం సాధించిన నాగార్జున విద్యార్థిని

విశాలాంధ్ర-కందుకూరు రూరల్ : ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ యునైటెడ్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెల్లూరుజిల్లా స్థాయిలో జరిగిన టాలెంట్ టెస్టులో కందుకూరు నాగార్జున ఇంగ్లీష్ మీడియం పబ్లిక్ స్కూల్ విద్యార్థిని షేక్ హీన ప్రథమ స్థానం సాధించింది. ఈ సందర్భంగా జరిగిన అవార్డు ప్రధాన కార్యక్రమంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి చేతుల మీదగా ప్రశంసా పత్రమును స్వీకరించడం జరిగింది. నాగార్జున పబ్లిక్ స్కూల్ విద్యార్థిని జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించడం పట్ల చదువుకు స్కూల్ యాజమాన్యం ఇస్తున్న ప్రాధాన్యతను ప్రశంసించారు. ప్రథమ స్థానం సాధించిన విద్యార్థిని అభినందిస్తూ చదువులలో మరింత ఉన్నత స్థానానికి చేరుకోవాలని తల్లిదండ్రులకు చదువు నేర్పిస్తున్న ఉపాధ్యాయులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్ లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినిని స్కూలు కరస్పాండెంట్ షాలిని రెడ్డి, ప్రధానోపాధ్యాయులు బి బాల బ్రహ్మం, మస్రెడ్డి, శ్రీనివాసులు, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు తదితరులు అభినందిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు.

వైభవంగా పెంచలకోన క్షేత్రంలో రథ సప్తమి వేడుకలు

విశాలాంధ్ర-రాపూరు : రాపూరు మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోన క్షేత్రంలో స్వయంభువు గా వెలసి భక్తుల ఆరాధ్యదైవంగా వెలుగొందుతున్న శ్రీ పెనుశిల లక్ష్మీ నృసింహ స్వామి దేవస్థానం సం దు మంగళవారం రథసప్తమి పండుగ సందర్భంగా ఉదయం శ్రీవారికి అభిషేకం,ఉదయం 6 గం లకు సూర్యప్రభ వాహన సేవ,8గం లకు శేష వాహన సేవ,10 గం లకు సిం హ వాహన సేవ, మధ్యాహ్నం 12 గంటలకు బంగారు గరుడ సేవ,2 గం లకు చక్రస్నానం,సాయంత్రం 4 గం లకు హనుమంత సేవ, సా యంత్ర 6 గం లకు అశ్వవాహన సేవ ,రాత్రి 8 గం లకు చంద్ర ప్రభ వాహన సేవ,సప్తవాహన సేవ లతో అత్యంత వైభవంగా జరిగిందని వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌ కర్యం కలగ కుండా ప్రత్యక్ష పర్య వేక్షణలో సిబ్బందితో ఆలయ డిప్యూటీ కమిషనర్ మరియు కార్యానిర్వహణాధికారి పోరెడ్డి శ్రీనివాసులు రెడ్డి భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించారు.

కాలుష్య ఉద్గారాలను తగ్గించే చర్యలను చేపట్టండి: కమిషనర్

విశాలాంధ్ర-నెల్లూరు టౌన్: నేషనల్ క్లీన్ హెయిర్ ప్రోగ్రాం (ఎన్.సి.ఎ.పి) కార్యక్రమంలో భాగంగా నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయం కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో ఆంధ్ర ప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ వారి నేతృత్వంలో మద్రాస్ ఐఐటీ కు చెందిన విద్యార్థులతో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నెల్లూరు నగర పాలక సంస్థ పరిధిలో స్వచ్ఛమైన వాయువును వాతావరణంలో ఉంచేందుకు గాను అవసరమైన రోడ్ డస్ట్ కలెక్టర్స్, ఎయిర్ ప్యూరిఫైయర్స్ తదితర ఎయిర్ పొల్యూషన్ కంట్రోల్ విధానాలను నగరంలో అమలు చేసేందుకు అవసరమైన పరికరాల పనితీరును పరిశీలించామని తెలిపారు. అదేవిధంగా నగరంలోని మురుగునీటి శుద్ధి కేంద్రాల వద్ద హానికరమైన వాయు వుల నియంత్రణకు తీసుకోవలసిన చర్యలపై చర్చించామని వివరిం చారు. ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ నిర్దేశించిన ప్రమాణాలను నగరవ్యాప్తంగా అమలు చేసేందుకు అవసరమైన అన్ని చర్యలను చేపట్టనున్నామని కమిషనర్ తెలియజేశారు. ఈ కార్యక్ర మంలో నగరపాలక సంస్థ ఎస్ఈ. రామ్మోహన్ రావు, రక్షా గ్రీన్ సొల్యూషన్ చంద్రమౌళి,ఈ.ఈ.లు రహంతు జానీ, శేషగిరిరావు, శ్రీనివాసరావు, ఎన్.కాప్,రాఖీ, ఐఐటి మద్రాస్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

రైతుల భూములపై రాజకీయం చేస్తున్న రెవిన్యూ అధికారులు

అధికారులపై కుర్చీలు వేస్తున్న గ్రామస్తులు - ప్రజా ఆగ్రహానికి రెవెన్యూ అధికారుల గ్రామసభలు అట్టర్ ప్లాప్

విశాలాంధ్ర- కావలి రూరల్: ప్రభుత్వానికి ప్రజలకు మధ్య అనుసంధానంగా వ్యవహరించాల్సిన అధికారులు ఆ దిశగా విధి నిర్వహణ చేయడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రైతుల కష్టాలను, వారి జీవన విధానాలను అర్థం చేసుకొని వారి భూములకు నిష్పక్ష పతంగా ధర నిర్ణయించి ఉన్నతాధికారులకు నివేదిక పంపాల్సిన అధికారులు మీన వేషాలు వేస్తున్నారని ఆరోప ణలు బలంగా వినిపిస్తున్నాయి. రామయపట్నం పోర్టుకు అనుసం ధానంగా పరిశ్రమలు పెట్టాలనే సంకల్పంతో ప్రభుత్వం సదుద్దేశంతో భూ సేకరణ చేయాలని అధికారులకు అప్పగించడం జరిగింది. కానీ రెవిన్యూ అధికారులు, మరిటన్ బోర్డు అధికారులు సంయుక్తంగా భూ సేకరణ చేసి అక్కడ ఉన్న మార్కెట్ ధర ప్రకారం ధర నిర్ణయించి ఉన్నతాధికారులకు నివేదిక పంపించాలి. కానీ ఇక్కడ రెవెన్యూ అధికారుల్లో మరి టైం బోర్డు అధికారంలో చిత్తశుద్ధి కనిపించడం లేదని ప్రజల్లో ఆరోపణలు వినిపిస్తున్నాయి. చీకటి ఒప్పందం చేసుకొని గుట్టు చప్పుడు కాకుండా గ్రామ సభలు పెట్టి వారు ఏదో ఒక రేటు చెప్పడంతో ప్రజల ఆగ్రహానికి గురవుతున్నారు. కావలి మండలంలో ఆనెమడుగు, చెన్నయ పాలెం గ్రామాలలో గ్రామ సభలు పెట్టి ప్రజల అభిప్రాయాన్ని తీసుకుని ఆ నివేదికను ప్రభుత్వ ఉన్నత అధికారులకు పంపించాలి. కనీసం మీడియాకు సమాచారం ఇవ్వకుండా గుట్టు చప్పుడు కాకుండా రెవెన్యూ అధికారులు గ్రామసభలు పెట్టడంతో అనుమానాలకు తావిస్తుందని ప్రజల్లో విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. తీర ప్రాంతంలో 12, వేల మంది రైతులు వ్యవసాయమే జీవనాధారంగా చేసుకుని జీవిస్తున్నారు. వ్యవసాయం చేసుకుంటూ బిడ్డలను చదివించుకుం టున్నారు. భూ సేకరణలో భాగంగా తప్పకుండా భూములు ఇవ్వాలి. కానీ ప్రజల అభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకొని వారి భవిష్యత్తు దృష్ట్యా అధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించి నిజమైన మార్కెట్ ధరను నిర్ణయించి ప్రభుత్వ ఉన్నతాధి కారులకు నివేదిక పంపించాలి. ప్రజలు ఇచ్చే టాక్స్ లతో జీతాలు తీసుకునే అధికారులు ప్రజలు మేలు చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టిసారించి గ్రామాల్లో ముందస్తుగా దండోరా వేయించి ప్రజాభిప్రాయంతో ధర నిర్ణయించి భూ సేకరణ చేస్తే అటు ప్రభుత్వానికి ఇటు ప్రజలకు మేలు చేసిన వారు అవుతారు.